# సులభ్ కాంప్లెక్స్ నిర్మాణమెప్పుడో?

- మూడు నెలల క్రితం నిధులు కేటాయింపు
- స్థలం గుర్తింపులో జాప్యం
- అధ్వానంగా పరిసర ప్రాంతాలు
- ఇబ్బందులు పడుతున్న మండలవాసులు


వాంకిడిలో అధ్వానంగా పరిసరాలు

**వాంకిడి:** నిత్యం వేలాదిమంది ప్రజలతో కిటకి టలాడే మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి మహారాష్ట్ర, ఆసిఫాబాద్, మంచిర్యాల వరకు నిత్యం వందల మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. అలాగే వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు, నిత్యావసర వస్తువులు కొనుగోలుకు వచ్చే ప్రజలు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రత్యేకించి ప్రయాణికులు, మహిళల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. తీవ్ర అసౌకర్యాల నడుమ గోడల చాటున, బహిరంగ ప్రదేశాల్లో ఒకటి కానిస్తుండడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. ప్రజల సౌకర్యార్థం టాయిలెట్స్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షలు కేటాయించి రెండు నెలలు గడిచినా ఇప్పటికీ పునాదులు పడలేదు.

**స్థలం కరువు..**
మండల కేంద్రంలో మరుగుదొడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.3 లక్షలు కేటాయించింది. దీంతో అధికారులు సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మొదట మండల కేంద్రంలోని ప్రధాన మార్కెట్ ఏరియాలో స్థలాన్ని పరిశీలించారు. అక్కడ కుదరకపోవడంతో మరో చోట పరిశీలించినా పలువురి నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టలేదు. మండల కేంద్రంలో ప్రధానంగా మార్కెట్ ఏరియాలో, ప్రతీ గురువారం నిర్వహించే వారసంత ప్రాంతంలో మరుగుదొడ్ల ఆవశ్యకత ఉంది. ఈ రెండు ప్రాంతాల్లో నిర్మాణాలు చేపడితే మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. కానీ అధికారులు మాత్రం ఎక్కడైన ఒకచోట మాత్రమే కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రభుత్వ స్థలం కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసినట్లు చెబుతున్నారు.

**అధ్వానంగా మారిన పరిసరాలు**
మండల కేంద్రానికి వందల మంది జనాలు వస్తుంటారు. వారసంత రోజు జనాల తాకిడి వేలల్లో ఉంటుంది. మండల పరిధిలోని ప్రజలతో పాటు అటు మహారాష్ట్ర ప్రాంతంలోని ప్రజలు సైతం వస్తుంటారు. ఉదయాన్నే వచ్చి వివిధ పనులు పూర్తి చేసుకుని సాయంత్రానికి ఇంటికి వెళ్తుంటారు. అయితే మరుగుదొడ్ల సౌకర్యం లేని కారణంగా బహిరంగ ప్రాంతాల్లోనే ఒంటికి రెంటికి వెళ్తుంటారు. దీంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. అటుగా వెళ్లే జనాలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల దోమల వ్యాప్తి విపరీతంగా పెరుగుతోంది. అపరిశుభ్ర వాతావరణంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో అవి అమలు కాక గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

### మార్కెట్ ఏరియాలో నిర్మించాలి



మండల కేంద్రంలో మరుగుదొడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వివిధ పనులతో వచ్చే ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఒంటికి రెంటికి వెళ్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలవ్యాప్తి పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం మార్కెట్ ఏరియాలో చేపడితే అందరికి ఉపయోగకరంగా ఉంటుంది.

– యెలగతి సుచిత్, వాంకిడి

### స్థలం కోసం దరఖాస్తు చేశాం



మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు కేటాయించాం. పలుచోట్ల స్థలాలు పరిశీలించినా అభ్యంతరాలు వ్యక్తమవడంతో పనులు ప్రారంభించలేదు. ప్రభుత్వ స్థలం కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశాం. స్థలం అప్పగించిన వెంటనే పనులు చేపట్టి మరుగుదొడ్లు నిర్మిస్తాం.

– ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో

# రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప


అధికారులతో మాట్లాడుతున్న కోనప్ప

**బెజ్జూర్:** సిర్పూర్ నియోజకవర్గంలోని పోడు రైతులను అటవీశాఖ అధికారులు ఇబ్బంది పెట్టొద్దని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శనివారం మండల కేంద్రంలో రైతులతో కలిసి అటవీశాఖ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. రిజర్వ్డ్ ఫారెస్ట్‌లోని పలు గ్రామాలలో ఇళ్ల వద్ద తాగునీటి కోసం బోర్లు వేసుకునే ప్రయత్నం చేయగా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో పంటలు వేసి సాగుచేసిన పోడు భూముల్లో పత్తికట్టలు తీయకూడదని అటవీ శాఖ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. గత సంవత్సరం సాగు చేసిన పోడు భూముల్లో రైతులు ట్రాక్టర్లను వాడకుండా చేతులతో పత్తి కట్టెలు తీసి మళ్లీ సాగు చేసుకునేందుకు సహకరించాలని అధికారులకు సూచించారు. పోడు భూమి సాగు చేసి అమ్ముకునే దళారుల వద్ద నుంచి అటవీశాఖ అధికారులు భూమిని స్వాధీనం చేసుకుని మొక్కలు నాటాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అందుకు సహకరిస్తామని సూచించారు. కొత్తగా పోడు వ్యవసాయం చేస్తే రైతులపై పీడీ యాక్ట్ కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అందుకు తా ము అభ్యంతరం వ్యక్తం చేయమన్నారు. అటవీ శా ఖ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అర్ధమండల దీక్షలు ప్రారంభం


భక్తులకు మాలధారణ చేస్తున్న పండితులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఏప్రిల్ 12వ తేదీన హనుమాన్ జయంతి పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో 120 మంది హనుమాన్ భక్తులు అర్ధమండల దీక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, శేఖర్‌శర్మల ఆధ్వర్యంలో గణపతి పూజ, నవగ్రహపూజ, ఆంజనేయస్వామికి రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామపూజ, మంగళహారతి, మహా మంత్రపుష్పం, మహా ఆశీర్వచనం, తీర్థ ప్రసాదవితరణ చేశారు. అనంతరం దీక్షాపరులకు మాలధారణ కార్యక్రమాన్ని అత్యంత కనుల పండువగా నిర్వహించారు. అనంతరం దీక్షా కాలంలో స్వాములు పాటించాల్సిన నియమ నిబంధనలను భక్తులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిన్నా వివేక్, ధర్మపురి వెంకటేశ్వర్లు, రూప్‌నార్ రమేశ్, ఎకిరాల శ్రీనివాస్, నారాయణమూర్తి, లక్ష్మణమూర్తి, మధు, సుధాకర్, గణపతి, సత్యనారాయణ, తిరుపతి, స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో అన్ని వర్గాల అభివృద్ధి


సీఎం, రాష్ట్ర మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న సింగరేణి కార్మికులు

**రెబ్బెన:** ప్రజాపాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమవుతోందని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం, ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానిస్తూ బిల్లులను గవర్నర్ ఆమోదానికి పంపించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఖైరిగూడ ఓసీపీ వద్ద కార్మికులు సంబరాలు చేసుకున్నారు. ముందుగా గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జీఎం విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి పూలమాలలు వేశారు. అనంతరం ఖైరిగూడ ఓసీపీ వద్ద సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం జనాభాలో సగం కంటే ఎక్కువగా ఉన్న బీసీలకు గత ప్రభుత్వం సముచిత స్థానం కల్పించలేదన్నారు. ప్రజాపాలనలో రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లులు ప్రవేశపెట్టడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అలాగే అన్ని రాష్ట్రాల కంటే ముందే ఎస్సీ వర్గీకరణ కోసం బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శులు భీమేశ్, ఏరియా కార్యదర్శులు చంద్రకుమార్, మాధవకృష్ణ, కేంద్ర కమిటీ నాయకులు సంజీవరెడ్డి, నారాయణ, నాయకులు చిన్నయ్య, ప్రభాకర్, శ్రీకాంత్, సంతోష్ మల్లేశ్, రాజేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రెండోరోజు 'పది' పరీక్షలు ప్రశాంతం


కెరమెరి: తనిఖీ చేస్తున్న సిబ్బంది

**సిర్పూర్(టి):** మండల కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో శనివారం రెండోరోజు పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. మొత్తం మూడు పరీక్ష కేంద్రాల్లో 635 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వాల్సి ఉండగా 634 మంది హాజరు కాగా ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు ఎంఈవో వేణుగోపాల్ తెలిపారు.

**దహెగాం:** పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం హిందీ పరీక్ష నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150 మంది విద్యార్థులకు గాను 149 విద్యార్థులు హాజరయ్యారని ఒక్కరు గైర్హాజరు కాగా, కేజీబీవీ పరీక్ష కేంద్రంలో 115 మందికి పూర్తిగా హాజరైనట్లు సీఎస్‌లు రామచంద్రారెడ్డి, అమరేందర్‌రెడ్డిలు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రభాకర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**కెరమెరిలో..**
**కెరమెరి:** మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మోడిలోని బాలికల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం రెండోరోజు పది పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. సెకండ్ లాంగ్వేజి పరీక్షలను విద్యార్థులు రాశారు. ఏడు పాఠశాలలకు చెందిన 336 మందికి అందరు పరీక్షలు రాసినట్లు సీఎస్, డీవోలు నర్సయ్య, చంద్రశేఖర్, తుల్సిరాం, గోపాల్ తదితరులు తెలిపారు.

# 'ఇష్టంగా చదివితేనే ఉత్తమ ఫలితాలు'


మాట్లాడుతున్న శ్రీనివాస్

**రెబ్బెన:** విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంగా చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వార్షిక ఫలితాల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి 7, 8, 9, 10 తరగతులు ఎంతో కీలకమన్నారు. ఈ దశలో విద్యపై పట్టు సాధించినప్పుడే ఉన్నత విద్యలో మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం జీఎం కార్యాలయానికి చేరుకుని ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డిని కలిసి సన్మానించారు. కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, ప్రధానోపాధ్యాయులు రవితేజ, ఉపాధ్యాయులు ఆర్లారెడ్డి, బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి..**
ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్ అన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులను కలిసి పరీక్షలు బాగా రాయాలని సూచించారు.

# జీపీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాగేశ్వర్‌రావు

**ఆసిఫాబాద్‌అర్బన్:** రాజంపేట గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులకు బీజేపీ సీనియర్ నేత, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్ రావు శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో 30 మంది కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, కరోనా సమయంలో కార్మికులు ఎందరికో ప్రాణభిక్ష పెట్టారని కొనియాడారు. ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలను అమలు చేస్తూ, ప్రతీనెల 5వ తేదీలోపు వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జయరాజ్, పార్టీ కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

### 'ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించండి'

**కెరమెరి:** మార్కెట్ ఇచ్చి నెలరోజులు కావస్తుందని వెంటనే ఇందిమ్మ ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. శనివారం మండలంలోని కొతారి(కల్లిగాం) గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ గ్రామాన్ని ఎంపిక చేసిందని, నిర్మాణ దశల ఆధారంగా ఇంటి నిర్మాణానికి బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. ఎలాంటి అనుమానాలు లేకుండా నిర్మాణ పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఇళ్ల పనులు చేపట్టలేకపోతున్నామని లబ్ధిదారులు తెలియజేశారు. ఆర్థిక సహాయం చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీశ్ ఉన్నారు.

### కొరెంగ గోవింద్‌రావు మృతి


గోవింద్‌రావు (ఫైల్)

**కెరమెరి:** మండలంలోని చాల్‌బాడి గ్రామానికి చెందిన గిరిజన ఆదివాసీ నాయకుడు కొరెంగ గోవింద్‌రావు(80) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడడంతో వెంటనే అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. చాల్‌బాడి గ్రామానికి పటేల్‌గా వ్యవహరించారు. విద్యుత్ సరఫరా కోసం ఐటీడీఏ అధికారులతో మాట్లాడి రాష్ట్రంలోనే తొలిసారిగా కానుగ నూనెతో విద్యుత్ తయారు చేసే యంత్రాన్ని మంజూరు చేయించారు. గోవింద్‌రావుకు భార్య మారుబాయి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### కౌటాలలో వాలీబాల్ పోటీలు

**కౌటాల:** జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కౌటాల పోలీస్‌స్టేషన్‌లో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఈనెల 24, 25, 26వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎస్సై మధుకర్ శనివారం తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల వాలీబాల్ జట్ల క్రీడాకారుల ఆధార్‌కార్డు వివరాలతో కౌటాల పోలీస్‌స్టేషన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు నగదుతో పాటు బహుమతులు అందిస్తామని తెలిపారు. వివరాలకు కౌటాల పోలీస్‌స్టేషన్‌లో, 8466943511 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

# జిల్లా కేంద్రంలో భారీ వర్షం


ఆసిఫాబాద్: జుబ్లీ మార్కెట్ రోడ్డుపై వరద నీరు


కెరమెరి: వడగళ్లతో నిండిన రహదారి

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రెండుగంటలపాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురవగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జనజీవనం స్తంభించిపోయింది. పట్టణంలోని జుబ్లీ మార్కెట్ రహదారితో పాటు పలు కాలనీల్లో వర్షపు నీరు చేరింది.

**కెరమెరి మండలంలో..**
**కెరమెరి:** మండలంలోని పలు గ్రామాల్లో శనివారం గంటన్నరపాటు వడగళ్ల వాన కురిసింది. అంతరత్న రోడ్లు జలమయమయ్యాయి. చేతికి వచ్చిన జొన్న పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. కంకులు నల్లబడిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పడింది. కొన్ని చోట్ల వృక్షాలు నేలకొరిగాయి.

**అంధకారంలో దహెగాం**
**దహెగాం:** మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన గాలివానకు విద్యుత్ సరఫరాలో అంతరాయమేర్పడింది. రాత్రంతా మండల ప్రజలు అంధకారంలో మగ్గారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దోమల బెడద, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. శనివారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో అంతా ఊపిరిపీల్చారు.

# అశోక్‌కు 'బెస్ట్ మోటివేటర్' అవార్డు



అవార్డు అందుకుంటున్న అశోక్ మహోల్కర్

**వాంకిడి:** మండల కేంద్రానికి చెందిన భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ శనివారం భూటాన్ దేశంలో 'బెస్ట్ మోటివేటర్' అవార్డు అందుకున్నారు. భూటాన్ దేశంలో భారతీయ బౌద్ధ మహాసభ, అంతర్జాతీయ అసోసియేషన్ ఆఫ్ బుద్ధిష్ట్ టూర్ అప్పరేట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బుద్ధిష్ట్ కాన్ఫరెన్స్, ఇంటర్‌నేషనల్ డే ఆఫ్ హ్యాపినెస్ కార్యక్రమంలో పాల్గొనగా భగవాన్ బుద్ధుడు, బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సమానత్వం, శాంతియుత జీవనంపై ప్రజల్లో కల్పిస్తున్న అవగాహన కార్యాక్రమాలను దృష్టిలో పెట్టుకుని అవార్డును ప్రదానం చేసినట్లు బీఎస్‌ఐ జాతీయ అధ్యక్షుడు చంద్రబోధి పాటిల్ తెలిపారు. యూజీసీ మాజీ చైర్మన్ ఎస్‌కే తొరాడ్, ప్రొఫెసర్ రిక్కా, నాయకులు కుంజన్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పాఠశాల తనిఖీ

**పెంచికల్‌పేట్:** మండలంలోని ఎల్కపల్లి ప్రాథమిక పాఠశాలను శనివారం పెంచికల్‌పేట్ తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని తెలుసుకోవడానికి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, వనిత ఉన్నారు.

### 25న పశువుల సంత వేలం

**సిర్పూర్(టి):** మండలంలోని హుడ్కిలి గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగించే పశువుల సంత వేలం ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అశోక్ తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను ఒక్క సంవత్సరం కోసం వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల వారు ఈనెల 25న ఉదయం 11 గంటలకు హుడ్కిలి గ్రామపంచాయతీ కార్యాలయంలో హాజరై వేలంలో పాల్గొనాలని సూచించారు.

### 24న వాంకిడి వారసంత..

**వాంకిడి:** మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో వారసంతల నిర్వహణకు ఈ నెల 24న వేలం నిర్వహించనున్నట్లు మండల పంచాయతీ అధికారి ఖాజా అజీజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి వాంకిడి, ఇందాని గ్రామాల్లో నిర్వహించే వారసంతకు గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే గోయెగాం గ్రామంలో పశువుల వారసంత నిర్వహణకు సైతం అదేరోజు వేలం ఉంటుందని, దీనికి స్థానిక గిరిజనులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సదరు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సంప్రదించాలని తెలిపారు.

### 'పల్లెల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం'

**బెజ్జూర్:** మారుమూల పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని టీపీసీసీ సభ్యుడు ఆర్శత్ హుస్సేన్ అన్నారు. శనివారం మండలంలోని కుకుడ గ్రామంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు నూతన సీసీరోడ్ల నిర్మాణానికి గ్రామస్తులతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. మండలంలో 21 సీసీరోడ్లు మంజూరైనట్లుగా తెలిపారు. మరిన్ని రోడ్లు మంజూరవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సద్మేక శాంతాబాయి మాజీ వార్డుమెంబర్ మెరుగు రమేశ్, నాయకులు సామల రాజన్న, నహిర్ అలీ, ఆవీద్ తదితరులు పాల్గొన్నారు.

### రాజంపేట జీపీకి రూ.11.51లక్షల ఆదాయం

**ఆసిఫాబాద్‌అర్బన్:** రాజంపేట జీపీలో శనివారం నిర్వహించిన వారసంత, మేకల సంత నిర్వహణ వేలంలో గ్రామపంచాయతీకి రూ. 11.51 లక్షల ఆదాయం సమకూరినట్లు పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ తెలిపారు. వారసంతను వేలంలో ఆత్రం వెంకటేశ్ రూ.3,50,000లకు సొంతం చేసుకోగా, మేకల సంతను కనకం మోతీరాం రూ.8,01,000కు సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దినసంత వేలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో తిరిగి వాయిదా వేశామని తెలిపారు.

### సివిల్ సప్లయ్ హమాలీ కార్యవర్గం

**ఆసిఫాబాద్:** తెలంగాణ సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసి) జిల్లా కమిటీని ఈ నెల 21న కాగజ్‌నగర్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు బోగె ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బొట్టుపెల్లి సుధాకర్, ఉపాధ్యక్షులుగా బుదాజి, దత్తు, కార్యదర్శులుగా మేకల శ్రీనివాస్, రాజన్న, కోశాధికారిగా శంకర్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, తిరుపతి, సాయి, కిషోర్, మారుతిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

### తహసీల్దార్ ఎదుట ఇద్దరి బైండోవర్

**సిర్పూర్(టి):** గతంలో నకిలీ విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించిన ఇద్దరు నేరస్తులను శనివారం ఎస్సై కమలాకర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేశారు. మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామానికి చెందిన తుస్సే భాస్కర్, నెన్నెల మండల కేంద్రానికి చెందిన అటకారపురం రమేశ్ అనే ఇద్దరిని బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

### నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**బెజ్జూర్:** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ డీఈ కృష్ణారావు, ఏఈ మక్బూల్ అన్నారు. శనివారం మండలంలోని కుకుడా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్ల పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పనుల్లో ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న రోడ్డు పనులను సక్రమంగా చేపట్టాలని సూచించారు. వాటర్ క్యూరింగ్ చేయాలని, లేకుంటే తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**'జమిలీ ఎన్నికలతో దేశాభివృద్ధి'**
**ఆసిఫాబాద్:** జమిలీ ఎన్నికల ద్వారా దేశ ఆర్థిక భారం తగ్గడంతో పాటు దేశం అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య కళాశాలలో వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై విద్యార్థులు, మేధావులు, విశ్రాంత ఉద్యోగులతో అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే ఎన్నిక చేపట్టడం ద్వారా దేశ ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోతున్నాయన్నారు. విద్యార్థులు, మేధావులతో అభిప్రాయ సేకరణ చేపట్టారు. సంఘం మండల కన్వీ నర్ కిరణ్, కోకన్వీనర్ సురేశ్, కళాశాల కరస్పాండెంట్ సాయిని రాజశేఖర్, ప్రి న్సిపా ల్ శ్రీనివాస్, న్యాయవాది దీపక్‌రావు, రిటైర్డ్ ఎస్సై వెంకన్న, నాయకులు ముషీరొద్దిన్ పాల్గొన్నారు.

**తేజాపూర్‌లో వైద్య శిబిరం**
**వాంకిడి:** మండలంలోని తేజాపూర్ గ్రామంలో శనివారం మండల మెడికల్ ఆఫీసర్ వినయ్ ఉప్రె ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ప్రతీనెల ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం ఎండల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, సిబ్బంది క్రిష్టియాణ, వసంత, ఉమా పాల్గొన్నారు.

**జింక మాంసం లభ్యం.. కేసు నమోదు**
**కౌటాల:** వన్యప్రాణులను వేటాడిన ఘటనలో మండల కేంద్రానికి చెందిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సిర్పూర్(టి) అటవీ రేంజ్ అధికారి ఇక్బాల్ శనివారం తెలిపారు. కౌటాల సమీపంలోని అటవీ ప్రాంతంలో వేటగాళ్లు ఉచ్చులు బిగించి వన్యప్రాణులను వేటాడుతున్నారనే సమాచారంతో మండల కేంద్రంలోని పలు ఇళ్లల్లో శనివారం అటవీశాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. పలువురి ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించగా విశాల్ అనే వ్యక్తి ఇంట్లో జింక మాంసం లభ్యమైంది. జింక మాంసం స్వాధీనం చేసుకొని, విశాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. సోదాల సందర్భంగా అటవీ అధికారులకు గ్రామస్తులకు వాగ్వాదం చోటు చేసుకుంది. పూర్తి వివరాలను విచారణ అనంతరం వెల్లడిస్తామని ఎఫ్‌ఆర్‌వో తెలిపారు.